ఓలా స్కూటర్లపై భారీ రాయితీ

ఎస్1-ఈ స్కూటర్‌పై రూ.26,750 డిస్కౌంట్

న్యూఢిల్లీ, మార్చి 13: ఎలక్ట్రిక్ స్కూటర్ల తయారీ సంస్థ ఓలా..హోలీ పండుగను దృష్టిలో పెట్టుకొని ప్రత్యేక ఆఫర్లను అందుబాటులోకి తీసుకొచ్చింది. హోలీ ఫ్లాష్ సేల్‌తో ప్రారంభించిన ఈ ఆఫర్ల కింద ఎస్1 ఈ–స్కూటర్లపై రూ.26,750 తగ్గింపునిస్తున్నది. అలాగే ఎస్1 ఎక్స్+(జనరేషన్ 2)పై రూ.22 వేలు డిస్కౌంట్‌ను ఇస్తున్నది. దీంతో ఈ రెండు మాడళ్ల ప్రారంభ ధరలు రూ.89,999, రూ.82,999కి దిగివచ్చాయి. ఈ ప్రత్యేక ఆఫర్లు ఈ నెల 17 వరకు మాత్రమే అందుబాటులో ఉండనున్నాయని పేర్కొంది. దీంతోపాటు మిగతా ఎస్1 స్కూటర్లపై కూడా రూ.25 వేల డిస్కౌంట్ ఇస్తున్నది. ప్రస్తుతం సంస్థ మూడు రకాల స్కూటర్లను విక్రయిస్తుండగా, ఇవి రూ.69,999 నుంచి రూ.1,79,999 ధరల శ్రేణిలో లభిస్తున్నాయి. వీటితోపాటు కొత్తగా ఓలా స్కూటర్లను కొనుగోలు చేసిన వారికి రూ10,500 వరకు ఆర్థిక ప్రయోజనాలు కల్పిస్తున్నది. దీంట్లో రూ.2,999 విలువైన మూవ్ ఆపరేటింగ్ సిస్టమ్, రూ.14,999 విలువైన వారెంటీని రూ.7, 499కి అందిస్తున్నది. వీటిలో ఎస్1 ప్రో+ మాడల్ రూ.1,59,999 నుంచి రూ.1.85 లక్షల మధ్యలో లభించనుండగా, ఎస్1 ప్రో మాడల్ రూ.1,29,999 నుంచి రూ.1,54, 999, ఎస్1 ఎక్స్ మాడల్ రూ.89,999 నుంచి రూ.1,19,999 మధ్యలో ధర నిర్ణయించింది.

రాబోయేది కోతల కాలమే!

ఇంకా తగ్గనున్న వడ్డీరేట్లు

వచ్చే ద్రవ్యసమీక్షల్లో రెపోరేటు 75 బేసిస్ పాయింట్లు దిగిరావచ్చన్న అంచనాలు

ఈ ఆర్థిక సంవత్సరం ద్రవ్యోల్బణం రిజర్వ్ బ్యాంక్ ఆమోదయోగ్య స్థాయిలోనే

తాజా నివేదికలో ఎస్బీఐ రిసెర్చ్ వెల్లడి



న్యూఢిల్లీ, మార్చి 13: రాబోయే ద్రవ్యసమీక్షల్లో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) కీలక వడ్డీరేట్లను గట్టిగానే కోత పెట్టవచ్చని ఎస్బీఐ రిసెర్చ్ ఎకోరాప్ తమ తాజా నివేదికలో అంచనా వేసింది. ఈ ఏడాది ఏప్రిల్, జూన్, అక్టోబర్ నెలల్లో జరిగే ద్వైమాసిక ద్రవ్య పరపతి విధాన సమీక్షల్లో రెపో రేటును 25 బేసిస్ పాయింట్ల చొప్పున మొత్తం 75 బేసిస్ పాయింట్లు తగ్గించే వీలుందని చెప్తున్నది. గత నెల జరిగిన ద్రవ్యసమీక్షలో దాదాపు ఐదేండ్ల తర్వాత రెపోరేటును ఆర్బీఐ పావు శాతం తగ్గించిన విషయం తెలిసిందే. అంతకుముందు 2020 మే నెలలో చివరిసారిగా తగ్గించారు. ఇప్పుడు రెపోరేటు 6.25 శాతంగా ఉన్నది. కరోనాతో దిగాలుపడిన దేశ ఆర్థిక వ్యవస్థను ఉత్తేజపర్చేందుకు వడ్డీరేట్లను పెద్ద ఎత్తున తగ్గిస్తూపోయిన ఆర్బీఐ.. ఆ తర్వాత ద్రవ్యోల్బణం అదుపు పేరిట వరుసగా పెంచుతూపోయింది. దీంతో 6.50 శాతానికి చేరింది. అయితే వచ్చే ద్రవ్యసమీక్షల్లో వడ్డీరేట్లు తగ్గుతాయన్న సంకేతాలను అప్పటి ఆర్బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ ఇచ్చారు. అందుకు తగ్గట్టే దాస్ తర్వాత వచ్చిన కొత్త గవర్నర్ సంజయ్ మల్హోత్రా.. ఫిబ్రవరిలో చేపట్టిన తన మొదటి ద్రవ్యసమీక్షలోనే 25 బేసిస్ పాయింట్లు తగ్గించారు. ఈ క్రమంలో వచ్చే ఏప్రిల్, జూన్ ద్రవ్యసమీక్షల్లోనూ వడ్డీరేట్లు 25 బేసిస్ పాయింట్లు చొప్పున తగ్గవచ్చుని, ఆగస్టులో విరామం ఇచ్చి అక్టోబర్ సమీక్షలో మళ్లీ 25 బేసిస్ పాయింట్లు తగ్గించవచ్చుని ఎస్బీఐ రిసెర్చ్ అంచనా వేస్తున్నది. ఇలా ఈ ఏడాది కనీసం 75 బేసిస్ పాయింట్లైనా రెపోరేటు తగ్గుతుందన్న విశ్వాసాన్ని వెలిబుచ్చుతున్నది.

4.7 శాతానికి ద్రవ్యోల్బణం

ద్రవ్యోల్బణం అదుపులోకి వస్తుండటం వడ్డీరేట్ల కోతలకు కలిసొస్తున్నదని ఎస్బీఐ రిసెర్చ్ చెప్తున్నది. ఈ జనవరి–మార్చిలో వినియోగదారుల ధరల సూచీ (సీపీఐ) ఆధారిత ద్రవ్యోల్బణం 3.9 శాతానికి తగ్గవచ్చుని, మొత్తం ఈ ఆర్థిక సంవత్సరం (2024–25) 4.7 శాతానికి పరిమితం కావచ్చుని పేర్కొంటున్నది. వచ్చే ఆర్థిక సంవత్సరం (2025–26) సైతం 4–4.4 శాతం శ్రేణిలోనే ఉండవచ్చుంటున్నది. దీంతో ఆర్బీఐ ఆమోదయోగ్య స్థాయిలోనే ద్రవ్యోల్బణం గణాంకాలుండటం వల్ల వడ్డీరేట్ల కోతలను ఇంకా ఆశించవచ్చుని అంటున్నది. ఈ ఫిబ్రవరిలో రిటైల్ ద్రవ్యోల్బణం ఏడు నెలల కనిష్ఠాన్ని తాకుతూ 3.6 శాతంగా నమోదైన సంగతి విదితమే. ఆహారోత్పత్తులు, శీతల పానీయాలు, కూరగాయల ధరలు తగ్గడమే ఇందుకు కారణమని కేంద్ర ప్రభుత్వం చెప్తున్నది.

బ్యాంకులపైనే ఆధారం

ఆర్బీఐ రెపోరేటును తగ్గించినా.. దానికి అనుగుణంగా బ్యాంకులు తామిచ్చే రుణాలపై వడ్డీరేట్లను తగ్గించకపోతే రుణగ్రహీతలపై భారం అలాగే ఉంటుందని, మార్కెట్‌లో కొనుగోలు శక్తి పెరగదని నిపుణులు చెప్తున్నారు. ఆర్బీఐ కూడా ఇటీవలికాలంలో ఇదే ఆందోళనను వ్యక్తం చేస్తూ వడ్డీరేట్ల తగ్గింపు ప్రయోజనాన్ని కస్టమర్లకు ఇవ్వాలని తరచూ సూచిస్తున్నదీ చూస్తూనే ఉన్నాం. రుణాలపై వడ్డీరేట్లు తగ్గితే ఈఎంఐల భారం దిగుతుంది. ఇది రియల్టీ, ఆటో, కన్జ్యూమర్ గూడ్స్ తదితర రంగాల్లో సేల్స్‌ను పెంచుతుంది. మొత్తానికి వచ్చే ఆర్బీఐ ద్రవ్యసమీక్షలపై అటు రుణగ్రహీతలు, ఇటు వ్యాపార-పారిశ్రామిక వర్గాలకు, మరోవైపు బ్యాంకులకు పెద్ద ఎత్తునే అంచనాలున్నాయని చెప్పవచ్చు.

కోతలకు ట్రంప్ సెగ

దేశీంగా ద్రవ్యోల్బణం అదుపులోకి వచ్చినా ఆర్బీఐకి వడ్డీరేట్ల తగ్గింపునకు మరో అడ్డంకి ట్రంప్ రూపంలో వచ్చిపడుతున్నది. అంతర్జాతీయ వాణిజ్యంలో సుంకాల పోరుకు కాలు దువ్వుతున్న అగ్రరాజ్యాధినేత.. భారత్‌పైనా వచ్చే నెల నుంచి అధిక సుంకాలు పడుతాయని హెచ్చరిస్తున్నది తెలిసిందే. ఇదే జరిగితే అమెరికా నుంచి దిగుమతయ్యే వస్తూత్పత్తుల రేట్లు అమాంతం పెరగడం ఖాయమే.

బీమా ప్రీమియంలపై జీఎస్టీ తగ్గింపు!

న్యూఢిల్లీ, మార్చి 13: బీమా ప్రీమియం చెల్లింపుదారులకు త్వరలో ఊరట లభించే అవకాశాలు కనిపిస్తున్నాయి. బీమా ప్రీమియం వసూళ్లపై విధిస్తున్న జీఎస్టీని తగ్గించే విషయంపై కేంద్ర ప్రభుత్వం తీవ్రస్థాయిలో కసరత్తు చేస్తున్నట్టు తెలుస్తున్నది. ఈ విషయంపై బీమా నియంత్రణ మండలి ఐఆర్‌డీఏఐ సూచనలు చేయాలని జీఎస్టీ కౌన్సిల్ ఆదేశించినట్టు తెలుస్తున్నది. ఈ నిర్ణయానికి అనుగుణంగా వచ్చే జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలోనే రేట్ల తగ్గింపుపై నిర్ణయం తీసుకునే అవకాశాలున్నాయి. మే, జూన్ నెలలో జీఎస్టీ కౌన్సిల్ సమావేశంకాబోతున్నది. ప్రస్తుతం హెల్త్, లైఫ్ ఇన్సూరెన్స్ ప్రీమియం వసూళ్లపై 18 శాతం జీఎస్టీని వసూలు చేస్తున్న విషయం తెలిసిందే. దీనిని తగ్గించాలనే ప్రతిపాదనపై గత కొన్నేండ్లుగా చర్చలు జరుగుతున్నప్పటికీ ఇంకా కొలిక్కిరాలేదు. ఈ సారి కొలిక్కిరానున్నట్లు, ఎంతమేర తగ్గించేదానిపై చర్చలు జరుగుతున్నాయని ప్రభుత్వవర్గాలు సూచనప్రాయంగా వెల్లడించాయి. ప్రీమియం వసూళ్లపై జీఎస్టీని సున్నా లేదా 5 శాతం లేదా 12 శాతానికి తగ్గించే అవకాశాలున్నాయి. కానీ, ఇటీవల కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను బీమా రంగ ప్రతినిధులు కలుసుకొని 12 శాతం విధించాలని సూచించారంట. పలువురు రాష్ట్ర మంత్రులు కూడా 5 శాతం విధించాలని ప్రతిపాదించారు. ఈ నేపథ్యంలో రంగంలోకి దిగిన ఐఆర్‌డీఏఐ..బీమా రంగ ప్రతినిధులతో సంప్రదింపులు జరుపుతున్నది. త్వరలో జీఎస్టీ కౌన్సిల్‌కు ఒక నివేదికను సమర్పించనున్నది.

నిధుల సేకరణలో కెనరా బ్యాంక్

న్యూఢిల్లీ, మార్చి 13: కెనరా బ్యాంక్ మరోసారి నిధులను సేకరించడానికి సిద్ధమవుతున్నది. బాసెల్–3 నిబంధనలకు లోబడి టైర్–2 బాండ్లను జారీ చేయడం ద్వారా రూ.4 వేల కోట్ల నిధులను సమీకరించాలని యోచిస్తున్నది. ఐదు లేదా పదేండ్ల కాలపరిమితితో ఈ బాండ్లను జారీ చేస్తున్నది. ఈ నిధుల సేకరణకు బ్యాంక్ బోర్డు అనుమతి నిచ్చినట్లు పేర్కొంది.

ఫోర్బ్స్ 40 అండర్ 40లో హైదరాబాదీ

హైదరాబాద్, మార్చి 13: హైదరాబాద్‌కు చెందిన వ్యాపారవేత్త అకిన్ అనలిటిక్స్ సీఈవో, ఫౌండర్ జానకి పులపర్తి..ఫోర్బ్స్ 40 అండర్ 40 జాబితాలో చోటు దక్కించుకున్నారు. కృత్రిమ మేధస్సుతో నడిచే డ్రోన్లను తయారు చేసే సంస్థకు ఆమె నాయకత్వం వహిస్తున్నారు. రక్షణ, వ్యవసాయం, ఇండస్ట్రియల్స్ రంగాల్లో పరిశోధనలు గావించారు. అలాగే 15 వేల మంది స్వయం సహాయక బృందాలకు చెందిన మహిళలకు డ్రోన్ల పైలెట్లుగా తీర్చిదిద్దారు.

సెన్సెక్స్ @1,05,000?

ఈ ఏడాది డిసెంబర్‌కల్లా చేరవచ్చు

మోర్గాన్ స్టాన్లీ అంచనా

ముంబై, మార్చి 13: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సుంకాలతో ఉరుముతున్నారు. అంతర్జాతీయ మార్కెట్లు ఒకడుగు ముందుకు, నాలుగడుగులు వెనుకకు అన్నట్టున్నాయి. భౌగోళిక-రాజకీయ ఉద్రికత్తలు ఆందోళనల్ని రేకెత్తిస్తుంటే.. మదుపరులు స్టాక్స్ నుంచి పెట్టుబడుల ఉపసంహరణలకు దిగుతూ ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తున్నారు. భారతీయ పరిస్థితులూ ఇందుకు మినహాయింపు కాదు. అయినప్పటికీ బాంబే స్టాక్ ఎక్స్చేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ ఈ ఏడాది ఆఖరుకల్లా లక్ష మార్కును దాటి 1,05,000 వద్దకు వెళ్తుందన్న ఓ తాజా అంచనా ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారుతున్నది. అవును.. మోర్గాన్ స్టాన్లీ వేసిన ఈ అంచనా ట్రేడ్ వర్గాల్లో హల్‌చల్ చేస్తున్నదిప్పుడు. ప్రస్తుతం సెన్సెక్స్ ఉన్న స్థాయితో చూసినట్టైతే.. మోర్గాన్ స్టాన్లీ అంచనా 41 శాతం అధికం మరి. గురువారం 74వేల మార్కునూ కోల్పోయింది. ఈ క్రమంలో ఏకంగా లక్ష స్థాయిని దాటేస్తుందని మోర్గాన్ స్టాన్లీ చెప్పడం మిక్కిలి ప్రాధాన్యతను సంతరించుకుంటున్నది. ట్రంప్ టారిఫ్ భయాలతో ఇటీవలికాలంలో దేశీయ స్టాక్ మార్కెట్లు వరుస నష్టాలనే చవిచూస్తున్నాయి. అప్పుడప్పుడు పెరిగినా.. ఆ తర్వాత వచ్చే నష్టాలు ఆ ఆనందాన్ని దూరం చేస్తున్నాయి. అయితే పరిస్థితులన్నీ చక్కబడుతాయన్నట్టుగా మోర్గాన్ స్టాన్లీ చెప్తున్నది. దీంతో మదుపరుల్లో కొత్త ఆశలు చిగురించే వీలుందని స్టాక్ బ్రోకర్లు ఆశాభావాన్ని వ్యక్తం చేస్తున్నారు.

74వేల దిగువకు సెన్సెక్స్

రియల్టీ, ఐటీ, వాహన రంగ షేర్లలో గురువారం భారీగా విక్రయాలు జరగడంతో వరుసగా ఐదోరోజూ సూచీలు నష్టపోయాయి. 200 పాయింట్లకుపైగా నష్టపోయిన సెన్సెక్స్ 74 వేల దిగువకు పడిపోయింది. చివరకు 73,828.91 వద్ద స్థిరపడింది. నిఫ్టీ సైతం 73.30 పాయింట్లు కోల్పోయి 22, 397.20 వద్ద ముగిసింది. స్టాక్ మార్కెట్ల వరుస నష్టాలతో మదుపరులు లక్షల కోట్ల సంపదను కోల్పోతున్నారు.

ఎల్ జీ ఐపీవోకి సెబీ గ్రీన్‌సిగ్నల్

న్యూఢిల్లీ, మార్చి 13: దక్షిణ కొరియాకు చెందిన ప్రముఖ ఎల్రక్టానిక్స్ పరికరాల తయారీ సంస్థ ఎల్జీ ఐపీవోకి స్టాక్ మార్కెట్ నియంత్రణ మండలి సెబీ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. వాటాల విక్రయం ద్వారా రూ.15 వేల కోట్ల నిధులను సేకరించాలని సంస్థ భావిస్తున్నది. స్టాక్ మార్కెట్లో లిస్ట్ కాబోయే దక్షిణ కొరియాకు చెందిన రెండో సంస్థ ఎల్‌జీ కానుండటం విశేషం. ఇప్పటికే గతేడాది హ్యుందాయ్ మోటర్ స్టాక్ మార్కెట్లో లిస్టైన విషయం తెలిసిందే. 15 శాతానికి సమానమైన 10.18 కోట్ల షేర్లను విక్రయించే ప్రతిపాదనపై గతేడాది సెబీకి ఎల్‌జీ దరఖాస్తు చేసుకున్నది. ప్రస్తుతం సెబీ నుంచి అనుమతిపొందినట్లు కంపెనీ వర్గాలు వెల్లడించాయి. మొత్తం ఐపీవో వివరాలు వెల్లడించకపోయినప్పటికీ రూ.15 వేల కోట్ల స్థాయిలో ఉంటుందని విశ్లేషకులు అంచనావేస్తున్నారు. గతేడాదికిగాను రూ. 64,087 కోట్ల ఆదాయాన్ని ఆర్జించింది.

ఇన్సూరెన్స్‌లోకి పతంజలి

డీఎస్ గ్రూప్‌తో కలిసి మాగ్మా జనరల్ ఇన్సూరెన్స్ కొనుగోలుకు రెడీ

న్యూఢిల్లీ, మార్చి 13: యోగా గురువు రామ్‌దేవ్ బాబా నేతృత్వంలోని పతంజలి ఆయుర్వేద్, రజ్నీగంధా తయారీదారు ధరంపాల్ సత్యపాల్ గ్రూప్ (డీఎస్ గ్రూప్) కలిసి సనోటి ప్రాపర్టీస్ ఎల్ఎల్‌పీ అనుబంధ సంస్థ మాగ్మా జనరల్ ఇన్సూరెన్స్‌ను కొనుగోలు చేయనున్నాయి. ఈ బీమా సంస్థను ఆదార్ పూనవాలా, రైజింగ్ సన్ హోల్డింగ్స్ సంయుక్తంగా నిర్వహిస్తున్నాయి. కాగా, కంపెనీ విలువ రూ.4,500 కోట్లుగా నిర్ణయించి ఈ డీల్ జరుగుతున్నట్టు గురువారం వెలువడిన ఓ ప్రకటన చెప్తున్నది. షేర్ల కొనుగోలు ఒప్పందం ప్రకారం మాగ్మా జనరల్ ఇన్సూరెన్స్‌తోపాటు సెలికా డెవలపర్స్, జాగ్వార్ అడ్వైజరీ సర్వీసెస్‌ల అమ్మకానికి సనోటి ప్రాపర్టీస్ ఆమోదం తెలిపింది. రెగ్యులేటరీ అప్రూవల్స్‌కు లోబడి ఈ లావాదేవీ పూర్తి కానున్నది. వివిధ విభాగాల్లో మాగ్మా జనరల్ ఇన్సూరెన్స్ 70కిపైగా ప్రొడక్ట్స్‌ను అందిస్తున్నది. అన్ని ప్రధాన రిస్క్‌లకు బీమా కల్పిస్తున్నది.

15 నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో ఏఐ బోధన

పెద్దపల్లి, మార్చి13 : ఈనెల 15 నుంచి పెద్దపల్లి జిల్లాలో ఎంపిక చేసిన ప్రాథమిక ప్రభుత్వ పాఠశాలల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (కృత్రిమ మేధ) ఏఐ బోధన ప్రారంభించాలని విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా సూచించారు. గురువారం హైదరాబాద్ నుంచి సంచాలకుడు నరసింహారెడ్డితో కలిసి ఆమె ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ విద్యా బోధనపై జిల్లా కలెక్టర్లు, విద్యాశాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పెద్దపల్లి సమీకృత జిల్లా కలెక్టరేట్ నుంచి కలెక్టర్ కోయ శ్రీ హర్ష , విద్యా శాఖ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యాశాఖ కార్యదర్శి మాట్లాడుతూ, గత నెలలో సర్కారు స్కూళ్లలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వినియోగిస్తూ విద్యార్థులకు సులభతరంగా విద్య బోధన చేసేందుకు పైలెట్ ప్రాజెక్టు కింద 6 జిల్లాలో ప్రారంభించామని, అందులో మంచి ఫలితాలు వచ్చినందున అన్ని జిల్లాలో అమలు చేసేందుకు కార్యాచరణ చేపట్టామని వెల్లడించారు. జిల్లాలో ఎంపిక 15 ప్రాథమిక పాఠశాలలో ఏఐ బోధన ఈనెల 15 నుంచి ప్రారంభించాలని సూచించారు.ప్రభుత్వ పాఠశాలలో చదివే 3 – 5వ తరగతి విద్యార్థులకు కనీస విద్యా ప్రమాణాలు, అభ్యాస సామర్థ్యాలు పెంపొందించేందుకు ఏఐ టూల్స్ వినియోగిస్తూ విద్యార్థులకు సులభతరంగా విద్యా బోధన చేయాలన్నారు. వీసీలో కలెక్టర్‌తో పాటు సమగ్ర శిక్ష సమన్వయకర్త పీఎం షేక్, అధికారులు పాల్గొన్నారు.

జాయింట్ సెక్రటరీగా అచ్చేవేణు



అచ్చేవేణు

గోదావరిఖని, మార్చి 13: పెరిక విద్యార్థి వసతి గృహం రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా గోదావరిఖనికి చెందిన బీఆర్ఎస్ రామగుండం నియోజకవర్గ సమన్వయ కమిటీ సభ్యుడు, గంగానగర్ పట్టణ అధ్యక్షుడు అచ్చేవేణు నియమితులయ్యారు. ఈ మేరకు గురువారం వసతి గృహం రాష్ట్ర అధ్యక్షుడు దొంగరి వెంకటేశ్వర్లు నియామకపు పత్రాన్ని విడుదల చేశారు.

దక్షిణ మధ్య రైల్వే

Follow us on X@SCRailwayindia

ద.మ. రైల్వే యొక్క టెండరు ప్రకటనల వివరాలను మా వెబ్‌సైట్ www.scr.indianrailways.gov.inపై చూడవచ్చును.

ప్రొఫార్మా 10-1
బహిరంగ ప్రకటన

PUB/0258/25

దిగువ సూచించిన సెక్షన్‌లో పూర్తి చేయబడిన సెక్షన్‌పై గల రైల్వే లైన్లు మరియు ఆవరణలను వినియోగించు వారందరికీ ఇందుమూలంగా నోటీసు ఇవ్వడమైనది:

సెక్షన్ విద్యుదీకరణ: PDPL బైపాస్ వద్ద (RKM: 2KM, TKM: 3.109 KM & ఫీడర్ TKM: 2.00 KM), కాజీపేట్ –బల్హార్షా మెయిన్ లైన్ నుండి పెద్దపల్లి– కరీంనగర్ లైన్‌ను కలిపే పెద్దపల్లి వద్ద కొత్త బిజి బైపాస్ లైన్ Loc No.4/13A (Ch: 4/770.10) నుండి LOC గాంట్రీ మాస్ట్ (Ch: 6/660.10) వరకు OHE ఫీడర్ మాస్ట్‌తో అదనంగా OHE మాస్ట్ Loc. 297/సి4 (Ch: 297/257.90) నుండి Loc. 4/14సి (Ch: 4/882.60) వరకు.

దక్షిణ మధ్య రైల్వేలోని సికింద్రాబాద్ డివిజన్, కాజీపేట్ –బల్హార్షా మెయిన్ లైన్ నుండి పెద్దపల్లి– కరీంనగర్ లైన్‌ను కలిపే పెద్దపల్లి వద్ద కొత్త బిజి బైపాస్ లైన్ Loc No.4/13A (Ch: 4/770.10) నుండి LOC గాంట్రీ మాస్ట్ (Ch: 6/660.10) వరకు OHE ఫీడర్ మాస్ట్‌తో అదనంగా OHE మాస్ట్ Loc. 297/సి4 (Ch: 297/257.90) నుండి Loc. 4/14సి (Ch: 4/882.60)/882.60) వరకు PDPL బైపాస్ లైన్ 25kV ఓల్ట్, 50Hz, a.c. ఓవర్‌హెడ్ ట్రాక్షన్ వైర్లలో తేది: **20-03-2025**న లేదా ఆ తర్వాత విద్యుత్ సరఫరా జరుగును. సదరు తేదీన మరియు సదరు తేది నుండి అన్ని వేళలా ఓవర్‌హెడ్ ట్రాక్షన్ లైన్లలో విద్యుత్ సరఫరా జరుగుతున్నట్టుగా పరిగణించబడును మరియు అనధీకృత వ్యక్తి ఎవరూ సదరు ఓవర్ హెడ్ లైన్ సమీపంలో పని చేయరాదు లేదా సమీపించరాదు.

ప్రొఫార్మా 10-2
ac 25kV ట్రాక్షన్ ప్రారంభం
"రహదారి వినియోగదారులకు హెచ్చరిక"

దిగువ సూచించిన సెక్షన్‌లో 25KV AC ఎలక్ట్రిక్ ట్రాక్షన్ ప్రారంభానికి సంబంధించి ప్రజలకు సమాచారమిచ్చు నిమిత్తం ఈ విధంగా ప్రకటించడమైనది:

సెక్షన్: PDPL బైపాస్ వద్ద (RKM: 2KM, TKM: 3.109 KM & ఫీడర్ TKM: 2.00 KM), కాజీపేట్ –బల్హార్షా మెయిన్ లైన్ నుండి పెద్దపల్లి– కరీంనగర్ లైన్‌ను కలిపే పెద్దపల్లి వద్ద కొత్త బిజి బైపాస్ లైన్ Loc No.4/13A (Ch: 4/770.10) నుండి LOC గాంట్రీ మాస్ట్ (Ch: 6/660.10) వరకు OHE ఫీడర్ మాస్ట్‌తో అదనంగా OHE మాస్ట్ Loc. 297/సి4 (Ch: 297/257.90) నుండి Loc. 4/14సి (Ch: 4/882.60) వరకు.

దక్షిణ మధ్య రైల్వేలోని సికింద్రాబాద్ డివిజన్, కాజీపేట్ –బల్హార్షా మెయిన్ లైన్ నుండి పెద్దపల్లి– కరీంనగర్ లైన్‌ను కలిపే పెద్దపల్లి వద్ద కొత్త బిజి బైపాస్ లైన్ Loc No.4/13A (Ch: 4/770.10) నుండి LOC గాంట్రీ మాస్ట్ (Ch: 6/660.10) వరకు OHE ఫీడర్ మాస్ట్‌తో అదనంగా OHE మాస్ట్ Loc. 297/సి4 (Ch: 297/257.90) నుండి Loc. 4/14సి (Ch: 4/882.60)/882.60) వరకు PDPL బైపాస్ లైన్ లైవ్ ట్రాక్షన్ వైర్ ప్రమాదకర సమీపానికి వెళ్లకుండా అత్యధిక ఎత్తుగల లోడ్స్‌తో వెళ్ళు వాహనములను నివారించు నిమిత్తం **రోడ్ లెవల్‌కు ఎగువన 4.78m స్పష్టమైన గరిష్ఠ ఎత్తుతో అన్ని లెవల్ క్రాసింగ్స్ వద్ద హైట్‌గేజ్‌లు స్థాపించబడినవి.**

లోడ్‌తో వెళ్లు వాహనముల యొక్క కార్యార్థం కొరకు పైన నిర్దిష్టపరచిన ఎత్తుని గమనించవలసిందిగా మరియు రహదారి వాహనములందు తీసుకెళ్లు లోడ్‌లు ఎట్టి పరిస్థితుల్లోనూ హైట్ గేజ్‌లను అతిక్రమించరాదని ప్రజలకు ఇందుమూలంగా ప్రకటించడమైనది.

అత్యధిక ఎత్తుతో కూడిన లోడ్‌తో వెళ్లు వాహనములకు సంభవించే ప్రమాదాలు దిగువ విధంగా ఉంటాయి: హైట్‌గేజ్‌కు ప్రమాదం మరియు తదుపరి రహదారికి మరియు అలాగే రైల్వే లైన్‌కు అవరోధం కలుగుతుంది. వాహనములపై తీసుకెళ్లు సామాగ్రికి లేదా పరికరాలకు లేదా వాహనములకు సైతం ప్రమాదం సంభవించవచ్చును. కండక్టర్లను తాకుట లేదా వాటి యొక్క ప్రమాదకర సమీపానికి వెళ్లు కారణంగా అగ్ని ప్రమాదం సంభవించవచ్చును మరియు ప్రాణాంతకం కావచ్చును.

A0328 — డిప్యూటి చీఫ్ ఎలక్ట్రికల్ ఇంజినీర్, గతిశక్తి, సికింద్రాబాద్

జూలపల్లిలో సీసీ రోడ్డు లొల్లి

- మహిళ , కాంగ్రెస్ నేత మధ్య ఘర్షణ
- తనపై దుర్భాషలాడారని, అందుకే కొట్టానని రాణాలో మహిళ ఫిర్యాదు
- తానేం అనలేదని, అకారణంగా దాడి చేశారంటూ సదరు నేత కంప్లయింట్
- కమాన్‌పూర్ పోలీసుల విచారణ

ఘర్షణ పడుతున్న కాంగ్రెస్ నేత, మహిళ

కమాన్‌పూర్: మార్చి 13: సీసీ రోడ్డు నిర్మాణ విషయంలో ఓ మహిళ, కాంగ్రెస్ నేత మధ్య ఘర్షణ జరిగిన ఘటన పెద్దపల్లి జిల్లా కమాన్‌పూర్ మండలం జూలపల్లిలో జరిగింది. వివరాల్లోకి వెళితే.. జూలపల్లి గ్రామం పరిధిలో ఆదర్శనగర్ ఉంటుంది. కాలనీలోని ఓ వీధిలో రెండ్రోజుల కింద సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం కాగా, స్థానికంగా నివాసం ఉండే చెక్క శేషక్క అలియాస్ స్నేహ అనే మహిళ అక్కడికి వెళ్లింది. పనులు నిర్వహిస్తున్న కాంగ్రెస్ నేత వైనాల రాజు దగ్గరికి వెళ్లి తమ వాడకు కూడా రోడ్డు వేయాలని కోరింది. గతంలో మంత్రి శ్రీధర్‌బాబుకు కూడా విన్నవించామని, అయినా రోడ్డు వేయలేదని, మీరైనా వేయించాలని విజ్ఞప్తి చేసింది. ఈ క్రమంలోనే సదరు కాంగ్రెస్ నాయకుడు తనపై పరుష పదజాలంతో దూషించాడని, అవమానించాడని అభియోగిస్తూ విషయాన్ని పెద్ద మనుషులకు చెప్పింది. అతని పిలిపించి అడగాలని కోరింది. ఈ క్రమంలో స్థానిక మహిళలు, పెద్ద మనుషులు కలిసి గురువారం సదరు కాంగ్రెస్ నేత పనులు చేస్తున్న ప్రాంతానికి వెళ్తుండగా, మధ్యలో రాజు ఎదురుపడ్డాడు. ఈ క్రమంలో శేషక్కను ఎందుకు దూషించావని మహిళలు అతని అడుగగా, వారి మధ్య వాగ్వాదం జరిగింది. ఈ క్రమంలో శేషక్క సదరు కాంగ్రెస్ నేత చెంపపై కొట్టింది. వైనాల రాజు తనపై దుర్భాషలాడాడని, కించపరిచేలా మాట్లాడాడని, అందుకే అతనిపై చేయి చేసుకున్నానంటూ చెక్క శేష్కక్క రాణాలో ఫిర్యాదు చేసింది. అయితే అంతకు ముందు కాంగ్రెస్ నేత వైనాల రాజు సైతం తన పని తాను చేసుకుంటున్న క్రమంలో శేష్కక్క వచ్చి అడ్డుకున్నదని, తనతో వాగ్వాదానికి దిగి దాడి చేసిందంటూ కమాన్‌పూర్ రాణాలో ఫిర్యాదు చేశారని, విచారణ చేపట్టినట్లు ఎస్ఐ కొట్టె ప్రసాద్ తెలిపారు. కాగా, ఈ విషయమై వైనాల రాజును వివరణ కోరగా, శేషక్కను తాను ఏమీ అనలేదని, రాజకీయ కుట్రలో భాగంగానే తనను అకారణంగా సమస్యల్లో ఇరికిస్తున్నారని వెల్లడించారు.

నాణ్యమైన విద్యుత్ సరఫరానే లక్ష్యం

సుల్తానాబాద్‌రూరల్,మార్చి13: రైతులకు నాణ్యమైన విద్యుత్ అందించడమే తమ లక్ష్యమని కనుకుల విద్యుత్ ఏఈ దామోదర్ రావు అన్నారు. సిఎండీ ఆదేశాల మేరకు సుల్తానాబాద్ మండలంలోని సుద్దాల గ్రామంలో గురువారం విద్యుత్ అధికారులు పొలం బాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఈ మాట్లాడుతూ రైతులకు విద్యుత్ అంతరాయం లేకుండా చర్యలను చేపటడం జరుగుతుందన్నారు. ట్రాన్స్‌ఫార్మర్లు, ఎర్త్ తదితర సమస్యలను రైతుల పంటల పొలాల వద్దకు వెళ్లి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో లైన్ ఇన్‌స్పెక్టర్ రాజేశంతో పాటు తదితరులు ఉన్నారు

అప్పన్నపేటలో ఉచిత వైద్యశిబిరం

పెద్దపల్లి రూరల్, మార్చి 13: అప్పన్నపేటలో కరీంనగర్‌కు చెందిన మెడికవర్ దవాఖాన వైద్య బృందం సభ్యులు ప్రజలకు ఉచితంగా వైద్యపరీక్షలు నిర్వహించారు. గ్రామంలోని అప్పన్నపేట ప్రాథమిక సహకార సంఘం ఆద్వర్యంలో నిర్వహించిన శిబిరంలో 120 మందికి వైద్యపరీక్షలు నిర్వహించగా డాక్టర్ నాగరాజు ప్రజలకు పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో దవాఖాన హెడ్ గుర్రం కిరణ్, అప్పన్నపేట సింగిల్ విండో చైర్మన్ చింతపండు సంపత్, సీఈవో గడ్డితిరుపతి, దవాఖాన మార్కెటింగ్ మేనేజర్ కోట కర్నాకర్, బొంగోని హరీష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మండల సమాఖ్య పాలకవర్గం

ఓదెల, మార్చి 13: ఓదెల మండలంలోని మల్లికార్జున మండల సమైక్య నూతన పాలకవర్గాన్ని గురువారం ఎన్నిక జరిగింది. జిల్లా సహకార కార్యాలయ అధికారి ఇమ్రాన్, ఎన్నికల అధికారి క్యాదాసి రజితల ఆధ్వర్యం లో మండల సమాఖ్య పాలకవర్గాన్ని గ్రామ సంఘా ప్రతినిధుల సభ్యులు ఎన్నుకున్నారు. అధ్యక్షురాలుగా ఆలేటి స్వప్న (బాయమ్మపల్లి), కార్యదర్శిగా పోషవేని అనూష (ఓదెల), కోశాధికారిగా జంగ అనూష (కొలనూర్)లు ఎన్నికైనారు. నూతనంగా ఎన్నికైన పాలకవర్గాన్ని సెర్ప్ సిబ్బంది అభినందిం చారు. కార్యక్రమంలో ఏపీఎం లతామంగేశ్వరి, సీసీలు శ్రీని వాస్, మల్లయ్య, కొమురయ్య, విజయ, రాజకుమారి, అకౌంటెంట్ భవానీ, ఆపరేటర్ పవన్‌కుమార్, గ్రామైక్య సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రైతులతో మాట్లాడుతున్న అధికారులు

తూము నుంచి నీటిని విడుదల చేస్తున్న రైతులు

కాల్వ నీటి కోసం రైతుల ఆందోళన

- కుంట కింద సాగు చేసిన పొలాలకు నీళ్లివ్వని అధికారులు
- ఆగ్రహంతో తూము ఎత్తి విడుదల చేసిన రైతులు
- పోలీసు బందోబస్తుతో మూసేసిన ఎస్సారెస్పీ అధికారులు
- విధిలేని పరిస్థితిలో నిరాశతో వెనక్కి

ధర్మారం, మార్చి 13 : పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం ఎర్రగుంటపల్లి శివారులోని ఎస్సారెస్పీ డీ 83/బీ కాల్వ నీటిని విడుదల చేసి పంట పొలాలను కాపాడాలని రైతులు ఆందోళనకు దిగారు. కుంట కింద సాగు చేసిన పొలాలకు నీరిచ్చే ప్రసక్తే లేదని కాల్వ తూమును ఎస్సారెస్పీ అధికారులు వారం కిందట మూసేశారు. వారబందీలో భాగంగా మళ్లీ గురువారం కాల్వలోకి నీళ్లు రావడంతో రైతులు తూముని ఎత్తి కాల్వ నీటిని విడుదల చేయగా, పోలీసు బందోబస్తుతో అధికారులు మూసేశారు. వివరాలిలా ఉన్నాయి. ఎర్రగుంటపల్లి గ్రామ శివారులో ఎస్సారెస్పీ డీ 83/బీ కాల్వకు దశాబ్దాల కిందటే తూము ఉంది. దీని ద్వారా ఎర్రగుంటపల్లి నుంచి ధర్మారం మండల కేంద్రంలోని ఊరు కుంట వరకు పంట చిన్న కాల్వ ఉంది. కాల్వ ద్వారా ఎర్రగుంటపల్లి, ధర్మారం శివారులో సాగు చేసిన పంటలతోపాటు మండల కేంద్రంలోని ఊరకుంటలోకి నీరు చేరితే, దాని కింద ఉన్న పొలాలకు సాగు నీరందుతుంది. కాగా, ఇదే తూము కాల్వకు ఎత్తుగా ఉండడంతో సక్రమంగా నీరందేది కాదు. దీంతో నాలుగేళ్ల కిందట అప్పటి మంత్రి కొప్పుల ఈశ్వర్ నిధులు కేటాయించి దాని పక్కనే మరో కొత్త తూము నిర్మించి పంటలకు సాఫీగా నీటి సరఫరా అయ్యేలా చేశారు. రైతులు ఇన్నాళ్లు ఈ కాల్వ నీటి ద్వారా ఎర్రగుంటపల్లి రైతులతోపాటు ధర్మారం ఊరకుంట కింద రైతులు వానకాలం, యాసంగిలో పంటలు పండించుకున్నారు. అయితే, ఈ యాసంగి సీజన్‌లో ఊరకుంటలో నీళ్లు పూర్తిగా తగ్గిపోయాయి. ఈ క్రమంలో కుంట కింద సాగు చేసిన వరి పొలాలు పొట్టదశలో ఉండడంతో నీరందక ఎండి పోతాయని ఆందోళన చెందిన రైతులు గురువారం ఎర్రగుంటపల్లి శివారులోని కాల్వ తూము నుంచి నీటిని విడుదల చేయడానికి వెళ్లారు. తూము మూసి ఉండడంతో తెరవాలని ఆందోళన చేస్తూ అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎర్రగుంటపల్లి బీఆర్ఎస్ నాయకుడు ఆవుల శ్రీనివాస్ రైతుల ఆందోళనకు సంఘీభావం తెలిపారు. ఆ సమయంలో అక్కడే ఉన్న ఎస్సారెస్పీ ఏఈ, లస్కర్లు ఈ తూము నుంచి నీటిని విడుదల చేయడం కుదరదని స్పష్టం చేశారు. సాగు విస్తీర్ణం ఎస్సారెస్పీ రికార్డుల్లో లేదని, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కుంటలు, చెరువుల కింద సాగు చేసిన పంటలకు నీటిని అందించడం కుదరదని వారు అభ్యంతరం తెలిపారు. ఎన్నో ఏండ్ల నుంచి ఈ తూము నుంచి నీరు ఊరకుంటలోకి వస్తున్నదని, అప్పుడు లేని అభ్యంతరం ఇప్పుడు ఎందుకని రైతులు ఆగ్రహించి వారిలో ఇద్దరు మూసిన తూమును ఎత్తి నీటిని విడుదల చేశారు. ఎస్సారెస్పీ ఏఈ ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు వచ్చి కాల్వ నీటి గురించి రైతులతో చర్చించారు. అధికారుల అనుమతి లేనిదే తూము నుంచి నీటిని విడుదల చేస్తే కేసు నమోదు చేస్తామని రైతులను హెచ్చరించడంతో విధిలేని స్థితిలో నిరాశతో వెనుతిరిగారు. శుక్రవారం ఊరకుంటకు ఎర్రగుంటపల్లి తూము నుంచి కాల్వ నీటిని విడుదల చేయకుంటే కరీంనగర్–రాయపట్నం రహదారిపై రాస్తారోకో చేస్తామని రైతులు హెచ్చరించారు.

65 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

పెద్దపల్లి/సుల్తానాబాద్, మార్చి13: పెద్దపల్లి, సుల్తానాబాద్ మండలంలో అక్రమంగా తరలిస్తున్న 65 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుకున్నామని జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి రాజేందర్ తెలిపారు. పక్కా సమాచారంతో గురువారం పెద్దపల్లిలోని బండారి కుంట, సుల్తానాబాద్ మండలంలోని దేవునిపల్లి గ్రామాల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బందితో కలిసి తనిఖీ చేశారు. పెద్దపల్లి పట్టణంలోని బండారికుంటలో 35, సుల్తానాబాద్ మండలంలోని దేవునిపల్లి గ్రామంలో 30 క్వింటాళ్లు అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యం, ఆటోను సీజ్ చేశామని వెల్లడించారు. సీజ్ చేసిన రేషన్ బియ్యాన్ని ఎంఎల్ఎస్ పాయింట్‌కు తరలించామని, ఆటోను పోలీస్ స్టేషన్ అప్పగించామని జిల్లా పౌరసరఫరాల అధికారి తెలిపారు. వాహనం యజమాని, డ్రైవర్, అక్కడ పనిచేస్తున్న ఇతర లేబర్‌పై రాష్ట్ర ప్రజా పంపిణీ వ్యవస్థ నియంత్రణ ఉత్తర్వులు 2016 ప్రకారం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశామని తెలిపారు. తనిఖీలలో డిప్యూటీ తహసీల్దార్లు రవీందర్, మహేష్ కుమార్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు

నాణ్యమైన బోధన కోసమే ట్విన్నింగ్స్

కాల్వశ్రీరాంపూర్, మార్చి13: నాణ్యమైన విద్యా బోధన కోసమే ట్విన్నింగ్స్ కార్యక్రమం నిర్వహించినట్లు ఎంఈవో మహేశ్ తెలిపారు. కాల్వశ్రీరాంపూర్ హైస్కూల్ లో గురువారం ట్విన్నింగ్స్ ఆఫ్ స్కూల్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పెద్దంపేట, కిష్టంపేట, ఇద్లాపూర్ ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు సైన్స్ కు సంబంధించిన అంశాలు, సైన్స్ ల్యాబ్ లో చూపించినట్లు ఎంఈవో మహేశ్ తెలిపారు. అనంతరం గ్రందాలయంలోని పుస్తకాలను చదివారు. విద్యార్థులు తరగతి గదిలో ఐఎఫ్‌పీ ప్యానెల్ బోర్డుల ద్వారా పాఠాలను ఎలా సులభంగా నేర్చుకోవచ్చో చూసి సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం సునీత, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పొత్కపల్లి పాఠశాలలో మెరుగైన సౌకర్యాలు

ఓదెల, మార్చి 13: పొత్కపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ట్విన్సింగ్ కార్యక్రమాన్ని అట్టహాసంగా నిర్వహించారు. ఇందులో కాంప్లెక్స్ పరిధిలోని రూపునారాయణపేట, మడక, ఇందుర్తి, గూడెం, గొల్లపల్లి, స్థానిక ప్రైవేట్ స్కూల్స్ నుంచి 2వందల మంది విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంఈవో రమేశ్ హెచ్ఎం భాషబోయిన సాంబయ్య, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సుల్తానాబాద్‌రూరల్,మార్చి13: మండలంలోని గర్రెపల్లి గ్రామంలోని జడ్పీహెచ్ఎస్ స్కూల్ కాంప్లెక్స్‌లో గురువారం ట్విన్సింగ్ ఆఫ్ స్కూల్ ప్రోగ్రాం నిర్వహించారు. గర్రెపల్లి కాంప్లెక్స్ పరిధిలోని యూపీఎస్ నారాయణరావుపల్లి, గొల్లపల్లి, ఐతరాజ్‌పల్లి, కాట్నపల్లి పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు. పాఠశాలలో ఉన్న ఐఎఫ్‌పి పానెల్, ల్యాబ్, స్పోర్ట్స్, డైనింగ్ హాల్, లైబ్రరీ మొదలగు వసతుల గుర్చి తెలియజేస్తు తెలంగాణ ప్రభుత్వం విద్యా వ్యవస్థను బాగు చేయడానికి ఎన్నో సౌకర్యాలు కల్పిస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో రాజయ్య, హెచ్ఎంలు కవిత, లచ్చయ్య, అంజయ్య, చంద్రమౌళి, తిరుపతి రెడ్డి, మహిపాల్ రెడ్డి, రాజయ్య, సీఆర్‌పి కిరణ్, తదితరులు ఉన్నారు.

మొల్లమాంబ జయంతి నిర్వహించాలి

సుల్తానాబాద్, మార్చి 13: కవయిత్రి మొల్లమాంబ జయంతి వేడుకలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని తెలంగాణ రాష్ట్ర కుమ్మర సంఘం రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్షుడు టికే శ్రీనివాస్ అన్నారు. గురువారం సుల్తానాబాద్‌లో మొల్లమాంబ జయంతి వేడుకలను నిర్వహించారు. అంతకుముందు ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, స్వీట్లు పంచిపెట్టారు. కార్యక్రమంలో నల్లవెల్లి ప్రభాకర్, టీకే రమేశ్, సాయిలు, లచ్చయ్య, రాజేశం, సత్యనారాయణ, నాంపల్లి రవీందర్, నాంపల్లి విజయ్‌కుమార్, విజ్జగిరి సంజీవ్, రవీందర్, రాపోలు రాజు, టీకే వెంకటేశ్, సంతోష్, సంపత్‌కుమార్, అజయ్‌కుమార్ తదితరులున్నారు